మున్సిపల్ భవనానికి మోక్షమెన్నడో?

- శిథిలావస్థలో 50ఏళ్ల కిత్రం నిర్మించిన భవనం
- రూ.1.20 కోట్లు మంజూరు
- టెండర్‌కు నోచుకోని పనులు



శిథిలావస్థలో మున్సిపల్ కార్యాలయం

రాయికల్: మున్సిపాలిటీ భవనం శిథిలావస్థకు చేరింది. 50 ఏళ్ల క్రితం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో నిర్మించిన భవనమే ఇప్పటికీ మున్సిపాలిటీ కార్యాలయంగా కొనసాగుతోంది. దీంతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, పనుల కోసం వచ్చే పట్టణ ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి 2018 ఆగస్టు 2న రాయికల్‌ను మున్సిపల్‌గా మార్చారు.

భవన నిర్మాణానికి సభ్యులు ఆమోదం

ప్రస్తుతం ఉన్న భవన స్థలంలోనే మున్సిపల్ కార్యాలయం నిర్మించేందుకు ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో రూ.1.20 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో భవన నిర్మాణం చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇటీవల కలెక్టర్ సైతం నిధుల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేయడంతో టెండర్ ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో గదులు సరిపోకపోవడంతో ఉన్న గదుల్లోనే రికార్డు రూమ్, కంప్యూటర్ రూమ్ సరిదిద్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడితే ఆ నీటికి రికార్డులు తడుస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంటనే స్పందించి రాయికల్ మున్సిపల్ భవనం త్వరగా నిర్మించేలా చూడాలని కౌన్సిలర్లు, పట్టణంలోని ప్రజలు కోరుతున్నారు.

టెండర్ ప్రక్రియ వేగవంతం చేస్తాం



ప్రస్తుతం ఉన్న రాయికల్ మున్సిపల్ కార్యాలయ స్థలంలోనే నూతన భవన నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం అయ్యేలా చర్యలు చేపడుతాం.

– గంగుల సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తా

- జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత
- మాస్టర్ ప్లాన్ రద్దుకు తీర్మానం ఆమోదించిన సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తానని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. కాగా జగిత్యాల మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జెడ్పీచైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు తెలియకుండా మాస్టర్ ప్లాన్ తీర్మానం ఇచ్చిన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని సమావేశంలో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోతె ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, అంబారిపేట సర్పంచ్ గొడిశెల గంగాధర్ మాట్లాడుతూ జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో తమకు తెలియకుండానే పంచాయతీ కార్యదర్శులు, అధికారులు మున్సిపల్‌కు గ్రామపంచాయతీ తీర్మానం అప్పగించారని, విచారణ చేసి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి జెడ్పీచైర్‌పర్సన్‌కు అందజేశారు. గ్రామాల్లో విద్యుత్ చార్జీలు ఏసీడీ పేరుతో వసూలు చేస్తున్నారని, అలాగే త్రీఫేస్ విద్యుత్ సమయపాలన లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంబారిపేట సర్పంచ్ గంగాధర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఇప్పటికే మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తానన్నారు. సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరుపై జెడ్పీచైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో స్వరూపరాణి, జెడ్పీటీసీ మహేశ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం..

జగిత్యాల ఎంపీడీవోగా పనిచేసిన స్వరూపరాణి మంగళవారం ఉద్యోగ విరమణ పొందడంతో మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్‌దావ వసంతతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు ఆమెను సన్మానించారు.

రైతులు ఇబ్బంది పడుతున్నారు


మాట్లాడుతున్న ఎంపీపీ జమున

సారంగాపూర్: విద్యుత్ సరఫరా తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్రీఫేజ్ సరఫరా ఏయే సమయాల్లో ఉంటుందో రైతులకు చెప్పాలని సభ్యులు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం సారంగాపూర్ ఎంపీపీ కోల జమున అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సభ్యులు మాట్లాడుతూ వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు వారంరోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వారంరోజుల నుంచి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సంబంధిత ఏఈ సతీశ్ సమాధానమిచ్చారు. మిషన్ భగీరథ పనులు పూర్తి చేసి నీటి సరఫరా మెరుగుపరచాలని సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపీడీవో మల్లారెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ప్రజల వద్దకు ఆర్టీసీ'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేటలో ప్రజల వద్దకు ఆర్టీసీపై అధికారులు మంగళవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీలో ఇస్తున్న రాయితీలు, విహారయాత్రల కోసం ఇచ్చే అద్దె బస్సులపై అవగాహన కల్పించా రు. సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి, స ర్పంచ్, ఆర్టీసీ అధికారులు వెంకటేశం, కిషన్‌రావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్, నాయకులు సుధాకర్, సాగర్, బాల్‌రెడ్డి, గంగనర్సయ్య పాల్గొన్నారు.

రాయితీ పథకాలను వినియోగించుకోవాలి

కథలాపూర్: ఆర్టీసీ ప్రవేశపెట్టిన రాయితీ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరుట్ల డిపో అధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తక్కళ్లపెల్లిలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులు కళాశాలలు, పాఠశాలల సమయానికి చేరుకునేలా బస్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. కోరుట్ల డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటేశం, కంట్రోలర్ కిషన్‌రావు, మొలిగె శ్రీనివాస్, జిల్లా రాజు, కోట శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦5న వేంకటేశ్వరస్వామి కల్యాణం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 5వ తేదీ ఆదివారం నుంచి స్వామివారి 23వ వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

✦కల్లూరులో పశువైద్య శిబిరం

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్‌లో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యులు డాక్టర్ ధీరజ్, సర్పంచ్ వనతడుపుల అంజయ్య, మాదాపూర్ పశువైద్యాధికారి డా.హిమజ, డా.బక్కయ్య, పశువైద్య సంపాదకులు అజమ్ ఖాన్, ఉపసర్పంచ్ సంకె రాకేశ్ పాల్గొన్నారు.

✦సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

కథలాపూర్: కథలాపూర్ బస్టాండ్‌లో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాకారులు ఆట, పాటలతో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటి నియంత్రణపై ప్రజలకు వివరించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఓవర్ స్పీడ్, డ్రంకెన్ డ్రైవ్‌తో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రామచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

✦డబ్బును పొదుపు చేయాలి

కథలాపూర్: విద్యార్థి దశ నుంచే డబ్బును పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

✦విద్యుత్ ఏసీడీ బిల్లులు వసూలు చేయొద్దు

కథలాపూర్: ఏసీడీ పేరిట అదనంగా విద్యుత్ బిల్లులు వసూలు చేయొద్దని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వకుంటే ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. నాయకులు హరిప్రసాద్, గంగాధర్, సంతోష్, మోయిన్ పాల్గొన్నారు.

✦ఒకరిపై కేసు నమోదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో తమ్ముడిని కట్టెతో కొట్టిన అన్నపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై అజయ్ తెలిపిన వివరా ప్రకారం కొల్వాయికి చెందిన సాకపురం రాంచంద్రం పాత గొడవలు మనసులో పెట్టుకుని వరుసకు తమ్ముడైన సాకపురం లక్ష్మణ్ ఇంట్లోకి వెళ్లి కట్టెతో కొట్టగా లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. లక్ష్మణ్ భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 12 వరకు అత్యంగా వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా బుధవారం ఉదయం అభిషేకం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. 3న స్వామివారి అగ్ని ప్రతిష్ఠాపన, 4న వసంతోత్సవం, 5న స్వామివారికి డోలోత్సవం, తెప్పోత్సవం, 6న పార్వేట్ ఉత్సవం, 7న వనమహోత్సవం, 8న వేద సదస్సు, 9న దోపు కథ, 10న సాయంత్రం రథోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. 11న రాత్రి ఏకాంతోత్సవం, 12న పవిత్రోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

అందరూ సమానమే

రాయికల్: సమాజంలో అందరూ సమానమేనని జెడ్పీటీసీ జాదవ్ అశ్విని అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అల్లీపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.

మేడిపెల్లి: భీమారం మండలం రాజలింగంపేట్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ ఎస్సై సుధీర్ రావు, ఎమ్మార్వో యూసుఫ్, సర్పంచ్ గగోజి చారి, ఉపసర్పంచ్ గంగరాజం పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని నర్సింహునిపేటలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎస్సై శ్వేత, సర్పంచ్ బాబుస్వామి, ఎంపీవో మహేందర్, ఆర్ఐ శ్రీనివాస్, ఉపసర్పంచ్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని దుంపేటలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్ధన్, ఎస్సై రామచంద్రం, సర్పంచ్ లత, ఎంపీటీసీ రమేశ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమల్లన్నస్వామి జాతర


ఆలయంలో జాతర ఉత్సవాలు

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో శ్రీమల్లన్నస్వామి జాతర మహోత్సవాలు ఐదోరోజు ఘనంగా నిర్వహించారు. మల్లన్నస్వామి జాతరలో భాగంగా శ్రీమల్లికార్జున స్వామికి నాగవెల్లి, అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలను అర్చకులు అంగరంగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ కుందేల్ల నర్సయ్య, ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మంద రాజరెడ్డి, తెలంగాణ జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేణి మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ నిమ్మల భూమారెడ్డి, ఎఎంసీ మాజీ డైరెక్టర్ సురకంటి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



భగీరథ నీళ్లు.. కాలువ పాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మిషన్ భగీరథ నీళ్లు కాలువ పాలవుతున్నాయి. కాకతీయ కాలువ నుంచి గ్రామాలకు వెళ్తున్న మెయిన్ పైప్‌లైన్ గేట్ వాల్వు నుంచి కాకతీయ కాలువలో నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదు. దీంతో స్వచ్ఛమైన నీరు వృథాగా పోతోంది. గేట్ వాల్వు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : ప్రేమ్, మిషన్ భగీరథ డీఈఈ
ఫోన్ నంబర్ 91001 20984

అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు


సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: అధికారులు ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జగిత్యాల ఎంపీడీవో స్వరూపరాణి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులు ఉద్యోగంలో ఉండి ప్రజలకు చేసిన సేవలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జగిత్యాలకు దేశంలోనే రెండోస్థానం రావడం గర్వకారణమన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీలు ములాసపు లక్ష్మి, రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ మహేశ్, ఎంపీడీవో సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఎంపీటీసీ మల్లారెడ్డి, సర్పంచులు స్వప్న, ప్రభాకర్, లక్ష్మణ్‌రావు, రూరల్ ఎంపీడీవో రాజేశ్వరి, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉన్నత విద్య ద్వారానే సమాజంలో గౌరవం

జగిత్యాల: ఉన్నత విద్య ద్వారానే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోర్సుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి గ్రూప్స్ ప్రిలిమ్స్‌కు 21 మంది అర్హత సాధించగా, ఎస్సై మెయిన్స్‌కు 95మంది అర్హత సాధించారన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమాధికారి రాజ్‌కుమార్, కౌన్సిలర్ నర్సమ్మ, జెడ్పీటీసీ అశ్వినియాదవ్, స్టడీసర్కిల్ డైరెక్టర్ నరేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..

పట్టణంలోని 27 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మంగళవారం అందజేశారు. కాగా వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చైర్మన్ గోలిశ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

రాయికల్: రాయికల్ మున్సిపల్‌లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ముందస్తుగా అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో వేసవికాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, పలు వార్డుల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, అంతేకాకుండా ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, కల్లెడ సునీత, మ్యాకల కాంతారావు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సారంగాపూర్: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు 5రోజుల పాటు జరిగే జాతర ఏర్పాట్లపై పలు శాఖల అధికారులు మంగళవారం ఆలయంలో సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి 3లక్షల మందికి పైగా జాతరకు తరలివస్తారని భక్తులు అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రావు, ఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఎంపీడీవో మల్లారెడ్డి, ఎస్సై మనోహర్‌రావు, ఎక్సైజ్ ఎస్సై రవీందర్‌రెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ చంద్రశేఖర్, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్‌లు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల జమున, గుర్రాల రాజేందర్‌రెడ్డి, పల్లికొండ రమేశ్, కాసుగంటి వెంకటరమణరావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కంటివెలుగు పకడ్బందీగా అమలు చేయాలి

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లిలో కంటివెలుగు పథకాన్ని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కంటివెలుగు పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు.

కథలాపూర్: మండలంలోని దుంపేటలో కంటివెలుగును తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఎంపీడీవో జనార్ధన్, ఎస్సై రామచంద్రం పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ కుమారస్వామి ప్రారంభించగా ఎంపీడీవో శైలజారాణి పరిశీలించారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య పాల్గొన్నారు.

వరిపైరు సస్యరక్షణపై అవగాహన

పెగడపల్లి: రబీలో సాగైన వరి పైరులో సోకుతున్న చీడపడల నివారణ, తీసుకోవాల్సిన సస్యరక్షణపై మండలంలోని బతికపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈవో మల్లేశం, సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీలు అనసూర్య, లచ్చయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం


సన్మానిస్తున్న ఆర్డీవో మాధురి

జగిత్యాలటౌన్: ఉద్యోగ నిర్వహణలో సేవలందించిన ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఆర్డీవో మాధురి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో నాలుగోతరగతి ఉద్యోగిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన శంకర్ వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. శంకర్ దంపతులను ఆర్డీవో సన్మానించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవీందర్, నవీన్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: పట్టణాభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సమష్టిగా కృషి చేయాలని చైర్‌పర్సన్ రాణవేని సుజాత సూచించారు. ఈ మేరకు మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య మాట్లాడుతూ నల్లా బిల్లు వసూలు విషయంలో అపరాధ రుసుం మినహాయించాలని కోరారు. మిషన్ భగీరథ పనులు పూర్తి చేసి ఇంటింటికీ నీరు సరఫరా చేయాలని 23వ వార్డు కౌన్సిలర్ బుచ్చిరెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ వార్డులో అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని 2వ వార్డు కౌన్సిలర్ యామ రాజయ్య కోరారు. కాగా మొత్తం 10 అంశాలను ప్రవేశపెట్టగా వాటిని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ రాజ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించే అభివృద్ధి పనుల కోసం 21 అంశాలను చర్చించి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణ అభివృద్ధికి సహకరించిన సభ్యులందరికీ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందిస్తున్న కార్తికేయ

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో గల శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం బీజేపీ రాష్ట్ర నాయకుడు పూదరి నిషాంత్ కార్తికేయ మంగళవారం రూ.20వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, రాకేశ్, హన్మాంత్, రాజేందర్, నర్సయ్య, రాజరెడ్డి, జమాల్ పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న నాంపెల్లి హరీశ్

వెల్గటూర్: మండలంలోని పైడిపెల్లికి చెందిన బెక్కెం హరికృష్ణ బంధువులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. రక్తదానం అవసరం ఉండగా స్పందించిన నాంపెల్లి హరీశ్ మంగళవారం రక్తం అందించారు.